క్లుప్తంగా

3న ద్విచక్ర వాహనాల వేలం

కొయ్యలగూడెం : ద్విచక్ర మోటారు వాహనాలకు ఈనెల 3వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం ఎస్సై జీజే విష్ణువర్ధన్ మంగళవారం పేర్కొన్నారు. సారా కేసులో పట్టుబడిన వాహనాలకు వేలం ప్రక్రియ నిర్వహించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని, ఈ నేపథ్యంలో వేలంలో పాల్గొనదలచిన వారు నేరుగా అదే రోజు స్టేషన్‌కి వచ్చి హాజరుకావాల్సిందిగా సూచించారు. వివరాలకు 08821 236233 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


కొత్తగూడెం స్కూల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బహూకరించిన దృశ్యం

కొయ్యలగూడెం : కుంతలగూడెం ప్రీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు దాతల సహకారంతో స్టడీ మెటీరియల్ సమకూర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి పిన్నమనేని ప్రవీణ్ రూ.5 వేలు విలువైన విద్యాసామాగ్రిని 75 మంది బాలబాలికలకు అందజేశారన్నారు. కార్యక్రమంలో పీసీ సభ్యులు, ఉపాధ్యాయులు ఎం.విజయ్. కె.అమృత, బాలబాలికలు పాల్గొన్నారు.

మార్చి 23 నుంచి వర్జీనియా కొనుగోళ్లు


గ్రేస్ మార్గరెట్

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు మార్చి 23వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కేంద్రం వేలం నిర్వహణ అధికారి గ్రేసీ మార్కెట్ మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు బోర్డు ఆక్షన్ మేనేజర్ డి.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. కొయ్యలగూడెంతో సహా ఎన్ఎల్ఎస్ పరిధిలోని మిగిలిన నాలుగు పొగాకు వేలం కేంద్రాలైన జంగారెడ్డిగూడెం1, 2, దేవరపల్లి, గోపాలపురంలలో అదేరోజు కొనుగోళ్లు ప్రారంభం అవుతున్నాయన్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం ద్వారా రైతులకు 10.5 మిలియన్ల కేజీల పొగాకు పంటకి అనుమతి ఇచ్చామన్నారు.

వైద్యానికి రూ.2 లక్షల సాయం


అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాటకశాల వెంకటరాజు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ వైద్యానికి దాత నాటకశాల వెంకటరాజు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని బాధితుల ఖాతాకు జమ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ మిక్సింగ్ యూనిట్‌సభ్యులు తెలిపారు. అనిల్ కుమార్ భార్య మాధిరిని, కుటుంబ సభ్యులను దాత వెంకటరాజు పరామర్శించి వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆ కుటుంబ పోషణ నిమిత్తం నెలకు రూ.10 వేలు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. వెంకటరాజు దాతృత్వంపై ఫొటోగ్రాఫర్లు, బాధితుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి


ఆర్ఆర్‌పేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్, సిబ్బంది

ఏలూరు టౌన్: నిబంధనలు పాటించాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపటం నేరమని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని ఆర్ఆర్‌పేట శ్రీనివాస థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన ఎస్సై ప్రసాద్, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర పత్రాలన్నీ వెంట తెచ్చుకోవాలని సీఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, అధిక వేగంతో ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్ పనులు చేయించొద్దు

ఏలూరు (టూటౌన్): ఆశ వర్కర్లతో వారికి సంబంధం లేని ఆన్‌లైన్ పనులు చేయించవద్దని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఎం అండ్ హెచ్‌ఓ ఎం.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆశ వర్కర్ల సమస్యలును తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి మద్దతు ప్రకటించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


ఔషధ తనిఖీ అధికారి కార్యాలయ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో రూ. 45 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మాణం చేసిన భవనంలో ఔషధ తనిఖీ అధికారి కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. అనంతరం ఈ కార్యాలయ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఎలీజా ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 13 ఔషధ తనిఖీ అధికారి కార్యాలయాలు ప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందడానికి ఇదొక నిదర్శనమన్నారు. నాణ్యమైన మందులను సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు ప్రతి గ్రామంలో రూ.కోటి విలువ చేసే కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వం అనేక సేవలు అందిస్తోందన్నారు. రైతుభరోసా, వెల్‌నెస్, సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తుంటే, అభివృద్ధి జరగడం లేదంటూ ప్రతిపక్షాలు చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మ, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, హెచ్‌డీఎస్ డైరెక్టర్ రాపోలు భావన రుషి, బత్తిన చిన్న, కౌన్సిలర్‌లు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఏలూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, జంగారెడ్డిగూడెం తనిఖీ అధికారి డి.సునీత, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఆర్ఐకి సన్మానం


తహసీల్దార్, ఆర్ఐను సన్మానించిన దృశ్యం

టి.నరసాపురం : ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న టి.నరసాపురం తహసీల్దార్ సుబ్బారావును, ఉత్తమ ఆర్ఐగా అవార్డు అందుకున్న దానికి రెవెన్యూ ఉద్యోగులు, చౌకడిపో డీలర్లు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. టి.నరసాపురం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని డీలర్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంచార పశు ఆరోగ్య సేవలు ప్రారంభం

వేలేరుపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవల వాహనాన్ని వేలేరుపాడులో మంగళవారం ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి ప్రారంభించారు. వాహనంలో హైడ్రాలిక్ రూమ్‌ను తహసీల్దార్ కె.చల్లన్నదొర ప్రారంభించారు. మండల కేంద్రంలో ట్రైల్ రన్ వేశారు. పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల రైతులకు ఈ వాహనం ద్వారా సేవలు అందనున్నాయి. ఈ సందర్భంగా ఏడీఏ డాక్టర్ సాయిబుచ్చారావు మాట్లాడుతూ పోలవరం మండల కేంద్రంలో ఒక సంచార వాహనం, వేలేరుపాడు మండల కేంద్రంలో మరొక సంచార వాహనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో వాహనానికి ప్రభుత్వం రూ.45 లక్షలు వెచ్చించిందని తెలిపారు. ఈ వాహనంలో వెటర్నరీ అస్టెంట్, ఒక వైద్యుడు ఉంటారన్నారు.


వేలేరుపాడులో సంచార పశు ఆరోగ్య సేవల వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే, వెంటనే ఆ ప్రాంతానికి వచ్చి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, వీఎల్‌ఓ ఏవీవీ సత్యనారాయణ, జేవీఓ అమ్ములు, సిబ్బంది ఎస్.రాజు, అచ్చుత్‌రావు, భవానీ, వైస్ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, మండల వ్యవసాయశాఖ చైర్మన్ కామినేని వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు


విజేతలుగా నిలిచిన కుంగ్‌ఫూ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : ఇటీవల హనుమాన్‌జంక్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని కుంగ్‌ఫూ మాస్టర్ గంధం సురేష్ తెలిపారు. ఈ పోటీల్లో 12 మంది విద్యార్థులు పాల్గొనగా ఎస్.జ్ఞానక్రిష్, ఎం.విగ్నేష్ ప్రథమస్థానం సాధించారన్నారు. ఎన్.మహేంద్ర, ఎన్.శ్రీహాస్, జ్ఞానదీప్, ఎం.శివకేశవ ద్వితీయ స్థానం, ఎస్.భవిష్యసాయి, ఎం.మోహిత్, మోబిన్ బాషా, ఎం.అభిషయ్, డి.జైనిరూప్ తృతీయ స్థానాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం జంగారెడ్డిగూడెంలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ కరాటే, కుంగ్‌ఫూ వంటి విద్యలు శారీరక, మానసిక సమతౌల్యానికి, పట్టుదలకు, ఆత్మవిశ్వాసానికి దోహదపడుతాయని, ఇటువంటి విద్యలను విద్యార్థులు అభ్యసించాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు మునిసిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఎం.అనుపమ, పఠాన్ రియాజ్‌ఖాన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

లో–వోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన


రాచన్నగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

బుట్టాయగూడెం :(జీలుగుమిల్లి) : వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, వేరుశనగ పంటలు కోత దశలో ఉండగా విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో అవి ఎండిపోతున్నాయని తమ పంటలను కాపాడాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. మంగళవారం రాచన్నగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళనకు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి లోవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో మోటార్లు సక్రమంగా పనిచేయక సాగునీరు అందటం లేదని దీంతో మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజీ సమస్య గురించి అనేక సార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రీ–ఫేజ్ విద్యుత్ సరఫరా తెల్లవారుజామున కాకుండా ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లో–ఓల్టేజీ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం వరలక్ష్మి, వీరంకి వెంకటేశ్వరరావు, నెట్టే నాగరాజు, పి.శివాజీ, వనమా వెంకటేశ్వరరావు, గన్నమని వెంకట దుర్గారావు, కుంజ రమేష్, పండు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం


గూటాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుమతి


రెడ్డిగణపవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతి

పోలవరం రూరల్ : ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు ఉంటే ఆ ప్రాంతవాసులు నిర్భయంగా తమకు తెలియజేయాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర హక్కులకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎస్సై ఎస్.పవన్‌కుమార్, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, డీటీ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ఎస్సీ, ఎస్టీలు సమస్యలు లేకుండా జీవనం సాగించే దిశగా, వారికి చట్టం, రాజ్యాంగం కల్పించిన అవకాశాలను వారికి అవగాహన కలిపించే ఉద్దేశంతో పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్ఎస్.శాంతి చెప్పారు.మండలంలోని రెడ్డిగణపవరంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశం ఉద్దేశం ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం, వాటికి పరిష్కారాలు వెతికి, వారు మెరుగైన జీవనం సాగించేందుకు నిర్దేశించిందన్నారు. సివిల్ రైట్స్‌డేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం జయమ్మ, వీఆర్వో హరి, మహిళా పోలీసు లలిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం చర్చించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రానికి ప్రత్యేక హదాకోసం పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ స్థానిక కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లో రాష్ట్ర పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు 2014లో పార్లమెంట్‌లో తీర్మానం చేసిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, 11 కేంద్రీయ విద్యాలయాలు, కడప ఉక్కు కర్మాగారం, రామయ్యపట్టణం ఎయిర్‌పోర్టు, గుంతకల్ రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీపై బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. అవసరమైతే పదవులకు రాజీనామాలు చేయాలన్నారు. విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వ మోసాన్ని ఎండగట్టాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం, ఏఐవైఎఫ్ నాయకులు యు.హేమ శంకర్, రాజేష్, మహర్షి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు తపాలా జీవిత బీమా ప్రత్యేక డ్రైవ్

ఏలూరు (టూటౌన్): తపాలా జీవిత బీమా 140వ వార్షికోత్సవాన్ని ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్ట్ ఆఫీసులలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ ఆసిఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లభించే తపాలా జీవిత బీమా పీఎల్ఐ ఇప్పుడు అన్ని రకాల డిగ్రీ లేదా డిప్లొమా పట్టభద్రులకు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామీణ తపాలా జీవిత బీమా ఆర్‌పీఎల్ఐ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర బీమా సంస్థలతో పోలిస్తే తపాలా జీవిత బీమా తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌తో లభిస్తుందని వివరించారు. ప్రజలంతా తపాలా జీవిత బీమా పొందాలని ఆయన కోరారు.

హిందీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తూర్పువీధి నగరపాలక సంస్థ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో దశమందం విద్యా సేవా సదన్ సంస్థ నిర్వహించిన హిందీ ప్రతిభా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ హిందీ భాషా ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన ఎస్.గీతిక, జె.గోవర్ధన్, బి.షెర్లీ బంగారు, సీహెచ్ నాగలక్ష్మి, ఎం.కుసుమంత్, దినేష్, శ్రీధర్ రజత, రోషన్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ హరిబాబు, హిందీ ఉపాధ్యాయులు వి.ప్రిస్కిల్లా కుమారి, ఎన్.లక్ష్మీ రమ్య అభినందించారు.

పిల్లలను స్కూల్‌కు పంపండి


బాలికల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): పిల్లలను తప్పనిసరిగా స్కూలుకు పంపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కబాడీగూడెం, పాముల దిబ్బ పరిసర ప్రాంతాల్లో బడికి వెళ్లని పిల్లల గురించి ఆరా తీశారు. స్థానికంగా తిరుగుతున్న బాలలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా స్కూలుకు పంపాలని లేని పక్షంలో హోంకి తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు పుచ్చల వెంకట్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలులో రైళ్లు ఆపాలని వినతి


రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న బొల్లిన నిర్మల కిషోర్

భీమడోలు : ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు, రైల్వే పీఏసీ సభ్యురాలు బొల్లిన నిర్మల కిషోర్ సోమవారం ఢిల్లీలో రైల్వే బోర్డు సమావేశంలో బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల భీమడోలు పర్యటనకు వచ్చేసిన నిర్మల కిషోర్‌కు భీమడోలు బీజేపీ మండల శాఖ భీమడోలులో రైళ్లు నిలుపుదల చేయాలని, బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో నిర్మల కిషోర్ బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, ఇది ఇక్కడ ప్రజలు, భక్తుల చిరకాల వాంఛ అని ఆయనకు ఆమె వివరించారు. దీనిపై స్పందించిన కృష్ణదాస్ విజయవాడలోని రైల్వే డీఆర్ఎంకు ఫోన్ చేసి భీమడోలులో రైళ్లు నిలుపుదల చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు నిర్మల కిషోర్ చెప్పినట్లు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ విలేకరులకు తెలిపారు. మరికొన్ని రోజుల్లో భీమడోలులో రైళ్లు నిలుపుదల, రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌లను ఏర్పాటు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భీమడోలులో హోటల్‌పై విజిలెన్స్ దాడులు

భీమడోలు : భీమడోలు జంక్షన్‌లోని బృందావన హోటల్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. హోటల్ యజమానిపై రెండు కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై జి.కె.నాగరాజు, ఏజీ శ్రీధర్‌బాబు రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేశారు. హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆరు గ్యాస్ సిలిండర్లలో ఐదు హెచ్‌పీ, ఒకటి భారత్ గ్యాస్ సిలిండర్లు కాగా వాటి విలువ రూ.16,458 ఉంటుందని పేర్కొన్నారు. యజమాని సలాది వీరవెంకట సత్యనారాయణపై 6ఏ, 7 1) కేసులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సిలిండర్లను స్వాధీనం చేసుకుని వాటిని సంబంధిత సీఎస్ డీటీకి అప్పగించారు. ఈ దాడుల్లో ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు వెజ్జు వినయ్, జి.మార్కండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ

టి.నరసాపురం : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో అంగన్‌వాడీ వర్కర్ల సెక్టార్ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు రూ. 5 లక్షలు పింఛన్ సౌకర్యం, రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ర్యాలీ

కామవరపుకోట : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 100 రోజులైన సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆధ్వర్యంలో బుధవారం జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో భాగంగా రావికంపాడులో దివంగత నేత డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కామవరపుకోటలో ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహించి ధర్మాజీగూడెం వెళతారన్నారు. కావున మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుట్టాయగూడెం : బుద్దులవారిగూడెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన వ్యక్తి గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బుద్దులవారిగూడెంకు చెందిన పొట్ట దుర్గారావు స్కూటీపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో దుర్గారావు కుడికాలు విరిగింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా క్షతగాత్రుడ్ని బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం


గర్భాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి మూలవిరాట్

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాధపురంలోని సుందర గిరిపై కొలువైన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 1 నుంచి 6 వరకు జరిగే కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకలో పాల్గొనాలని ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు కోరారు.